# ఫలశ్రుతి

సత్యం శంకరమంచి

రాధ కిటికీ దగ్గర నుంచుని జగన్నాథం కోసం ఎదురుచూస్తోంది. వీధిలోని ఎగుడు దిగుడు రాళ్ళమీదా, ఎదురుగా ఉన్న పూరిపాకలమీదా మసగ మసగ్గా వెన్నెల. ఎనిమిదయింది. ఊరు సర్దు మణుగుతోంది. రాధ అత్తగారు భోజనం చేసి పడమటింట్లో పడుకుంది. చిన్నపాలేరు గేదెపాలు తీసి జగన్నాథానికి ఎదురు వెళ్ళాడు.

ఇవ్వాళ పొలంలో నూర్పిళ్ళు. పొద్దున్న పొలం వెళ్ళేప్పుడు జగన్నాథం ఉల్లాసంగా ఉన్నాడు. స్నానంచేసి దేవుడిముందు సాగిల పడి రాధతో చెప్పాడు, పొలం వెళ్తున్నానని. రాధ అప్పటికే తలార స్నానం చేసింది. నుదుట పెద్ద కుంకంబొట్టు పెట్టుకుంది. విరబోసికున్న జుట్టు కొసల సన్న ముడి వేసికొంది. ముఖానికి రాసుకున్న పసుపు మెరుపులో. ఆమె నీలికళ్లు తళతళ మెరుస్తున్నాయి. జగన్నాథం రాధ ఇచ్చిన బొట్టు తీసికొంటూ ఒక్కసారి భార్యవైపు చూశాడు. అతనికి రాధ ఏదో కొత్తగా కన్పించింది. తెలతెల్లవారుతూండగా చెరువులో అప్పుడే విచ్చుకున్న కలువపూవుని చూస్తున్నప్పుడు కలిగే హాయి అనుభవించాడతను. రాధ సిగ్గుపడి తల వాల్చుకుంది. జగన్నాథం భార్యను ఎప్పుడూ అట్లా చూడలేదు. ఆ పదును చూపు వయసులో ఉన్న కుర్రవాళ్ళ చూపు. తను ఆ వయసు దాటిపోయాడు. తనకూ రాధకూ పధ్నాలుగేళ్ళ తేడా.

జగన్నాథం రాధని ఐదేళ్ళ వయస్సప్పటి నుంచీ చూస్తున్నాడు. చిన్నప్పుడు రాధ ఆడుకుంటూ చెంగనాలు పెడ్తూండేది. ఎగురుతూ వచ్చి జగన్నాథం వొళ్ళో దూకేది. మారాం చేసి బజారుకి తీసికెళ్లమనేది. పూలు, మిఠాయి కొనిపించేది 'అక్కకు లేవు. ఇవన్నీ నాకే' అని ఉడికించేది. ఇప్పటికీ జగన్నాథానికి రాధలో ఆ పసితనపు వగరే కన్పిస్తూంది.

జగన్నాథం మొదటి భార్య శ్యామల, రాధ అక్క. శ్యామల అకస్మాత్తుగా ఈ లోకం నుంచి తప్పుకుంది. రెండు కుటుంబాల మధ్య మూడేళ్ళు రాకపోకలు లేవు. జగన్నాథం వ్యవసాయం పనిమీద అత్తవారి వూరు వెళ్ళటం జరుగుతున్నా అత్తవారింటికి వెళ్ళకుండా పని ముగించుకుని రాత్రికి రాత్రే ఇంటికి తిరిగొచ్చేవాడు. అథవా ఏనాడన్నా రాత్రికి ఉండి పోవాల్సివస్తే హోటల్లో మకాం చేసేవాడు. ఒక రోజున హఠాత్తుగా మామగారు బజార్లో ఎదురయ్యాడు. బలవంతాన ఇంటికి తీసికెళ్ళాడు. ఆ వీధి మలుపు తిరుగుతుంటే శ్యామల స్మృతిలోకి వచ్చింది. జరీ అంచు నీలిరంగు చీర కట్టుకుని గుమ్మం దగ్గర మంచుని తనకోసం ఎదురు చూసేది. దూరాన్నుంచి తన్ని చూసి ఇంట్లోకి పరుగెత్తుకెళ్ళి కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళు తీసికొచ్చేది. ఆ మల్లెచెట్టు పువ్వులే తను సాయంత్రంపూట కోపిచ్చేవాడు. దొడ్లో ఆ అరుగుమీదే వెన్నెలరాత్రిళ్ళు పొద్దుపోయేదాకా కూర్చుని కబుర్లు చెప్పుకునేవారు. ఒకరోజు తనమీద కోపం వచ్చి అవతలి గదిలోకి వెళ్ళి పడుకుంది. ఒక రాత్రివేళ అలికిడికి తను లేస్తే వెచ్చటి కన్నీళ్ళతో బిక్కు బిక్కుమంటూ కౌగలించుకున్న శ్యామల, తన మెడ చుట్టూ చేతులు చుట్టి 'ఇంకెప్పుడూ వెళ్ళను. ఇంకెప్పుడూ కోపం తెచ్చుకోను...... ఇం కెప్పుడూ వెళ్లను...'

శ్యామల అబద్ధం చెప్పింది. వెళ్ళి పోయింది...వెళ్ళి పోయింది.

ఆ రోజు రాత్రి అంతా ముభావంగా గడిచి పోయింది. వంటా, వడ్డనలూ, భోజనాలూ పడకా అన్నీ నిశ్శబ్దంగా భారంగా జరిగి పోయాయి. గాలినిండా విషాదం ఆవరించింది, ఎవరికీ మాటలులేవు. జగన్నాథానికి ఆ రాత్రి నిద్రలేదు. తెల్లవారుజాము నెప్పుడో కొంచెం కునుకు పట్టింది జగన్నాథానికి. ఎవరో పాదాలు మృదువుగా తట్టి లేపుతున్నట్లనిపించింది. శ్యామల తనని అలాగే లేపేది. కళ్ళు తెరిచి చూశాడు. ఎదురుగా శ్యామల...శ్యామల...

'లే బావా ! కాఫీ అయింది.

జగన్నాథం కళ్ళు తడుచుకు చూశాడు. అవే నీలి కళ్ళు...అదేగొంతు...రాధ ! ...ఎంత పెద్దదైంది! రాత్రి కనిపించనేలేదు.

జగన్నాథం పరిశీలనగా చూస్తూంటే రాధ సిగ్గు పడి తలొంచుకొని అంది 'కాఫీ అయింది. లేచి పళ్ళు తోముకో.' జగన్నాథం

ఇంకా ఆశ్చర్యంగా చూస్తూండడం గమనించి చెంగున గది అవతలకి గెంతి వెళ్ళిపోయింది.

జగన్నాథం ఆ తర్వాత రెండు మూడు సార్లు మామగారింటి కెళ్ళాడు. ఆ వూళ్ళో పని ఉన్నప్పుడల్లా వాళ్ళింటికి వెళ్ళివస్తూనే వున్నాడు. ఒకసారి జగన్నాథం మామగారు 'అయిందేదో అయిపోయింది. రాధని చేసుకో' మని సూచించాడు.

జగన్నాథం ఆశ్చర్యపోయాడు. ఆ మాటలు ఆ రకంగా ధ్వనిస్తా యని నమ్మలేకపోయాడు. సమాధాన మేమీ చెప్పకుండా వెంటనే బయలుదేరి పల్లెకు వచ్చేశాడు. జగన్నాథం బాధల్లా ఒక్కటే. ఇలాంటి ప్రతిపాదన ఒకటుందని రాధకు తెలిస్తే ఆ పసిపిల్ల ఎంత క్రుంగిపోతుందో నని. ఆ రోజున తలలో నెరిసిన వెంట్రుక స్ఫుటంగా కన్పించింది. ఒకరోజు మాటల సందర్భంలో తల్లికి ఇలా అడిగా రని చెప్పాడు. తల్లి తనలాగా బాధపడలేదు. సంతోషించింది. ఎంత సంతోషించిందో చెప్పడానికి, మర్నాడే బయలుదేరి మామగారింటికి వెళ్ళటమే నిదర్శనం. మూడోరోజున తిరిగొచ్చి ఎంతో సంబరంతో చెప్పింది. దేవుడు తన్ని దయగా చూశా డనీ, తను చేసిన తప్పు దిద్దా డనీ, మాఘమాసంలో ముహూర్తా లున్నా యనీ, తిరుపతి కొండమీద పెళ్ళి జరగా లనీ, ఈ సంవత్సరం కందులు అమ్మటానికి వీలులే దనీ, కోత లొచ్చేప్పటికి ఆవుని కొనేయా లనీ, వ్యవసాయం పాలేరొక్కడు చాలడు; ఇంటిపనికి ఇంకో పాలేర్ని పెట్టుకోవా లనీ..

జగన్నాథానికి కోపం వచ్చింది. గతాన్ని తల్లి త్వరగా ఎలా మర్చిపోగలిగిందా అనుకున్నాడు. కొడుక్కి మొట్టమొదటిసారిగా పెళ్ళి చేస్తున్నట్టుగా ఉప్పొంగిపోతోంది. శ్యామలని ఇంత త్వరగా మర్చిపోవటం దారుణ మనిపించింది. కోపాన్ని అణుచుకుంటూ అన్నాడు 'అమ్మా! నా కీ వయసులో......'

సగంలోనే ఆపి తల్లి అంది 'నాయనా! నా అదృష్టం బావుంది. దేవుడు చల్లగా చూశాడు. ఇంకేమీ అడ్డుచెప్పక ఈ ముసలి ప్రాణాన్ని సంతోషంగా దాటిపోనీ.'

జగన్నాథానికి చికాగ్గా వుంది. 'అమ్మా! రాధని అడిగావా?'

అడక్కేం; నవ్వుతూ వొప్పుకుంది.

'అబద్ధం! ఎందుకొప్పుకుంటుంది?' జగన్నాథానికి నమ్మకం కలగలేదు. మర్నాడు బయలుదేరి మామగారి వూరు వెళ్ళాడు. మధ్యాహ్నం నిద్ర తర్వాత రాధ టిఫిన్ తీసుకొచ్చింది. టిఫిన్ టేబుల్ మీద పెట్టి 'కూచో' అన్నాడు. రాధ కూర్చోలేదు. సిగ్గుపడుతూ నుంచుంది. 'కూర్చో రాధా! ఫర్వాలేదు.' రాధ కుర్చీలో ఒక పక్కగా ఒదిగి కూర్చుంది.

'నా ముందు అంత సిగ్గెందుకు రాధా! చిన్నప్పుడు నా వొళ్ళో కూర్చుని ఆడుకునే దానివి జ్ఞాపకంలేదూ?' అన్నాడు జగన్నాథం తన వయస్సుని సూచిస్తూ.

రాధ మరింత సిగ్గుపడింది.

'నిన్నొక్కటి అడుగుదా మని వచ్చాను.' రాధ తల పైకెత్తి చూసింది.


'నువ్వు వొప్పుకున్నావుటగా?'

'ఊ' అని నవ్వుతూ తలొంచుకుంది.

జగన్నాథం ఈ దృశ్యాన్ని ఊహించుకోలేదు. ఈ ఒప్పుకోడం కూడా పసితనమే అనుకున్నాడు. విడమర్చి చెప్పాలనుకున్నాడు.

'చూడు రాధా! నీకూ నాకూ వయస్సులో చాలా తేడా వుందని నీకు తెలుసు. నేను జీవితంలో గాయపడ్డవాణ్ణి. అంతా మర్చిపోయి మళ్ళీ యథాతథంగా జీవితం ప్రారంభించగల ధైర్యం నా కుందో లేదో తెలియదు. మధ్య ఎందుకు వొప్పుకున్నావో నా కర్థం కావటం లేదు. నీ అక్క అంటే నా కెంత ఇష్టమో నీకు తెలుసు. శ్యామలని పోగొట్టుకున్న నా మీద జాలిచేత వొప్పుకుంటే అది పొరపాటు. నాకు వచ్చిన లోటేమీ లేదు. నేను ఇలా వున్నా తృప్తిగా బతగ్గలను.

నేను జీవితంలో చాలాభాగం అనుభవించేశాను. నువ్వింకా జీవితంలోని తీపి, చేదు రుచి చూడాల్సినదానివి. నాకు పట్నవాస మన్నా, ఆడంబరా లన్నా ఈనాటి నాగరికతా లక్షణా లన్నా గిట్టవు. నా పనులు చూసుకుంటూ తలొంచుకుని రోజులు గడిపేయడం నా మతం. నీ అభిరుచులకూ, నాకూ పొత్తు కుదురుతుందో లేదో తెలియదు. నిన్ను చేసికొన్నాక నువ్వు ఆశాభంగం పొందకూడదు. పైగా నన్ను చేసికొంటే ఆ పల్లెటూళ్ళో ఉండాల్సివస్తుంది. నా వ్యవసాయం, నా అలవాట్లు నీకు నచ్చకపోవచ్చు. మా



అమ్మ పెద్దదై పోతోంది. ఆమె సేవకూడా నీమీదే పడుతుంది.'

రాధ కన్నీరు కారుస్తోంది.

'ఏమిటి రాధా ?'

'ఇన్ని మాట లెందుకు బావా! నేను నీకు తగ నని చెప్పరాదూ ?' అంది రాధ కళ్ళు తుడుచుకుంటూ.

జగన్నాథం విస్తుపోయాడు. రాధేనా మాట్లాడుతోంది! ఇలాంటి సమాధానం వస్తుందని కలలోకూడా ఊహించలేదు.

రాధ అంది 'నేను వొప్పుకుంది నీ మీద జాలిచేతా కాదు, మా నాన్న కట్నం ఇచ్చి, మంచి సంబంధం తేలేడని భయంకొద్దీ కాదు...సరేనా ? టిఫిన్ తీసుకో.' రాధ పెదవులమీద విచ్చుకుంటున్న మొగ్గలాంటి చిరునవ్వు.

జగన్నాథం వెళ్ళిపోతున్న రాధకేసి చూస్తూ అనుకున్నాడు.

రాధ పసిపిల్ల కాదు.

రాధ ఇంట్లో అడుగు పెట్టడంతో అత్తగారు బాధ్యత లన్నీ కోడలికి అప్పగించింది. ఆమె వేళకు భోజనానికి వస్తుంది. మిగతా కాలం భాగవతం చదువుకుంటూ గడుపుతుంది. రాధకి కొత్త లోకంలో అడుగు పెట్టినట్లుంది. లంకంత ఇల్లు. ఇద్దరు పాలేర్లు. తన ఇష్టాన్ని కాదనేవా ళ్ళెవ్వరూ లేరు. తను ఏం చెప్తే అది జరిగిపోతోంది. జగన్నాథం దగ్గరనుంచి చిన్న పాలేరుదాకా అంతా రాధ కనుసన్నల్లో ఉంటున్నారు. రాధ కోరికలు మన్నించడమే వాళ్ళ పరమావధి అన్నట్టు ప్రవర్తిస్తారు. ఇంతమంచి మనుషులు ప్రపంచంలో ఉంటారా అవిపించింది రాధకి. రాధకి అదే విచారం_అంతా తన సుఖంకోసమే అన్నట్టున్న ఆ ఇంట్లో, రాధ వాళ్ళ కోసం కష్టపడి, వాళ్ళను ఆదుకుని, వాళ్ళ కోరికలు తీర్చి. వాళ్ళని సంతోషపెట్టి, మెప్పు పొంది, తృప్తిపడడానికి అవకాశమే లేదు.

నిర్మల కృష్ణా ప్రవాహంలా తృప్తిగా సంవత్సరం వెళ్ళిపోయింది. జగన్నాథం ఎప్పుడూ నవ్వుతూ ఉంటాడు. అతని ముఖంలో చిరాకు గాని, కోపం గాని ఇంత వరకు రాధ చూడలేదు. ఆయనకు కోపం తెచ్చుకోడం చేతకాదేమో అనుకునేది.

ఒకసారి అడిగింది, 'మీ కెప్పుడూ కోపం రాదేం ?'

జగన్నాథం పెద్దగా నవ్వాడు. 'నా కంతా హాయిగా జరిగిపోతోంటే కోప మెందుకు రావాలి ? ఇతరుల్ని మార్చటానికి ప్రయత్నించటం కంటె మనం సర్దుకు పోవటమే సుఖమని నా నమ్మకం. అంచేత నాకు అసంతృప్తిగాని, నిరాశగాని సామాన్యంగా తటస్థపడవు. నా క్కోపం లేదన్నావు కదూ ? ఎందుకుండాలి? నా కేం తక్కువైందని? నన్ను కంటికి రెప్పలా చూసుకుంటే నాకు కోప మెట్లా వస్తుంది ? నా జీవితమంతా ఇట్లా వెళ్ళిపోతే చాలు. నాకు తెల్లవారుతోందన్నా, ఎక్కణ్ణించైనా ఉత్తరం వచ్చిందన్నా భయం. ఎక్కడ మార్పొచ్చేస్తుందో నని. ఇలా హాయిగా ఏ మార్పులూ లేకుండా వెళ్ళిపోవాలి.'

రాధ అట్లా కళ్ళప్పగించి చూస్తోంది. రాధకి చుట్టూ ఏమీ కన్పించలేదు. వెలిగిపోతున్న అతని ముఖం ఒక్కటే కన్పిస్తోంది. కాంతి చిమ్ముతున్న అతని రెండు కళ్ళుమాత్రమే కన్పిస్తున్నాయి. ఆ కాంతి దగ్గరగా మరీ దగ్గరగా వచ్చి తనలో కలిసిపోతున్న ట్లనిపించింది. తర్వాత అంతా చీకటి. భయం...సంతోషం...జీవనసత్యాల తేజస్సు ముందు రాధ కళ్లు మూతపడిపోయాయి.

ఋతువులు మారిపోతున్నాయి. వర్షాకాలం వచ్చి వెళ్ళింది. చలికాలం దాటిపోయింది. ఎండలు ముదురుతున్నాయి. కాని రాధ జీవితంలో మార్పులేదు. కాపరానికొచ్చిన కొత్తల్లో ఉన్నట్లే ఉంది. తెల్లవారుజామునే లేవటం, ఇంటిపనులు చూసుకోవటం, జగన్నాథాన్ని పొలానికో, బజారుకో పంపించటం, మధ్యాహ్నం అత్తగారికి వడ్డించి భర్తకోసం కాచుక్కూచోవటం, భోజనా లయ్యాక పడక, సాయంత్రం మళ్ళీ వంట, రాత్రి స్నానాలకి నీళ్ళు తోడటం, భోజనాలు, నిద్ర. ఈ కార్యక్రమాలలో మార్పేమీ లేదు. రోజూ అంట్లు కడగటం, వండటం, మళ్ళీ కడగటం, వండటం — ఇంతేనా జీవితం ? ఇం కేమీ కొత్తదనం లేదా ? రాధలో ఒక రకమైన అసంతృప్తి మొలకెత్తింది. దాంతో చిరాకూ, విసుగూ. అన్నిటికంటె ఎక్కువ చిరాకు కలిగించేది జగన్నాథం నిబ్బరం. బతుకు కొండ చిలువలా ఈడ్చుకుంటూ నడుస్తున్నా, ఏమీ పట్టనట్లు హాయిగా చిరునవ్వుతో కాలం గడిపేస్తున్నాడు. జగన్నాథానికి కోపం వచ్చి, విసుక్కుని, గట్టిగా తిడితే బావుండు ననుకునేది రాధ. రాధకు జగన్నాథం మీద ఇష్టం పోతోందా అంటే_లేదు. అతను కావాలి. అతని మేఘాల్లాంటి తన చేతుల్తో గుండెకు హత్తుకోవాలి. తను అతన్ని ప్రేమిస్తోంది_ సందేహం లేదు. కాలంతోపాటు అది పెరగటం లేదన్నదే విచారం. రోజు రోజుకీ కొత్త చిగుళ్ళు వేసి, కొత్త రంగులతో దర్శనమివ్వటం లేదు. ఎప్పటిలాగా యథారూపంగా, చల్లగా, మంచుగడ్డలాగా... నిశ్చలంగా చెరువులో నీళ్ళలాగా బతకటం రాధ కిష్టంలేదు. ఉరకలు వేయాలి, పొంగులెత్తాలి, బాధలు రావాలి, ప్రేమకోసం, అతని కోసం తను బలై పోవాలి. రాధకు తెలుసు జగన్నాథం తనని ఎంత ప్రేమగా, ఎంత సర్వస్వంగా భావిస్తున్నాడో. అంతమాత్రాన చాలదు. జగన్నాథం రాధ అంటే వివశుడై పోవటం జనానికందరకూ తెలియాలి. జనం వాళ్ళ ప్రేమకు అవాంతరాలు కల్పించాలి. ఆ అడ్డంకు లన్నీ తుత్తునియలై పోవాలి. మరింత బలంతో, ఉద్రేకంతో మరిన్ని కన్నీళ్ళతో ఇద్దరూ ఏకమైపోవాలి. ఇదే రాధ కోరిక. రాధలోని యవ్వనపు నెత్తురు ఈ వానపాము బతుకుమీద తిరుగుబాటు చేస్తోంది.

రోజులు భారంగా గడుస్తున్నాయి. దినచర్య యథాప్రకారం నడుస్తోంది. వంట,

తిండి. నిద్ర ఇవే రాధకీ, జగన్నాథానికీ మధ్య అనుబంధాలుగా ఉన్నాయి. రాధ, తన ప్రేమ వంటింటికి బానిసైపోతోం దని భావించింది. ప్రేమ జీవితాన్ని ఆవరించి రంగులు పూయాలి. కాని నిత్యజీవితం తన ప్రేమని నడిపిస్తోంది.

వీధిలో బండి వస్తున్న చప్పు డయింది. రాధ కిటికీ విడిచి వాకిట్లో కొచ్చింది. ఎప్పుడూ నవ్వుతూ ఉండే జగన్నాథం ముఖం ఇవ్వాళ ప్రసన్నంగా లేదు. కాళ్ళు తుడుచుకోడానికి తుండు ఇచ్చి రాధ అంది, 'ఏం అలా ఉన్నారు ?'

'పొలంలో ఏదో గొడ వయింది.'

'ఏవి టది.'

'ఆ ! ఏదోలే పోనిద్దూ.'

రాధ మనస్సు చివుక్కు మంది. ఆ గొడ వేదో తనకు చెప్పకూడదన్న మాట. అతని కష్టం పంచుకునే అవసరం తన కేమీ లేదన్న మాట! కావా లని పాలేరుమీద అనవసరంగా కేకలు వేసింది. జగన్నాథానికి విన్పించేటట్లు పెద్దగా అరిచింది. భోజనాల ముందు ఎవరూ మాట్లాడలేదు. జగన్నాథం గదిలో పడుకుని పేపరు చదువుకుంటున్నాడు. గదిలో కొస్తున్న రాధని చూసి అన్నాడు. 'ఏం రాధా ! ఇవ్వా ళంత కోపంగా ఉన్నావ్ ?' అతని ముఖంమీద వెన్నెలలాంటి చిరునవ్వు .

రాధ ఆ ముఖం చూసి కరిగిపోయింది. అయినా లోపల కోపం పొంగుకొచ్చింది.

'పొలంలో ఇవ్వా ళేం జరిగింది ?'

'పెద్దవిషయ మేం కాదు. ఏదో చిన్న గలాటా. మన వెంకడు...'

రాధ సాంతం చెప్పనివ్వకుండా అంది 'నే నిందాక అడిగినప్పుడే ఎందుకు చెప్పలేదు మీరు ?'

'ఎందుకులే అనవసరంగా అని.'

'నేను మీ కేమీ సాయం చేసేదాన్ని కాదన్న మాట. మీ బాధలు మీరే పడాలా ?'

'అలా ఎందు కనుకుంటావు రాధా. నువ్వు లేకపోతే నే నింత హాయిగా ఉండే



"చూశావ్ ! ఎంత గొప్పగా చిత్రించానో ! అది నిజం రొట్టే అనుకొని చీమలు ఎలా గెక్కిపోతున్నాయో చూడు !"

"ఆ ఘనత మీ కుమారరత్నానికే చెందుతుంది; బెల్లం తింటూ ఆ చేతుల్తో దానిమీద పులిమాడు ఇందాక — మీ రెక్కడ తంతారో అని చూడం డెలాగ భయపడుతున్నాడో మరి..."

వాణ్ణా. నా కేలోటూ రాకుండా నువ్వు సాయం చేస్తుండబట్టికాదూ నే నింత తృప్తిగా బతుకుతున్నాను.'

'నాకు తెలుసు; చిన్నపిల్లకి మాయ మాటలు చెప్పి ఊరుకోబెట్టినట్లు చెప్తున్నారు. కలుగులో ఎలుకలాగా నేను బతకలేను.'

జగన్నాథం లేచికూర్చున్నాడు. ఆశ్చర్యపోయి చూస్తున్నాడు. 'అయితే...'

'అయితే అని మీ రేం చెప్పక్కర్లేదు. నే నేం బుల్లిపాపాయిని కాదు. నన్ను పసిపాపని ఆడించినట్టు ఆడించి జోకొట్టి వెళ్ళిపోతున్నారు. నా క్కావలసింది అది కాదు. నేను మీ భార్యని. మీ జీవితంలో, బాధలో, సంతోషంలో నాకు భాగం కావాలి.'

జగన్నాధం మూగవోయాడు. సంబాళించుకుని అన్నాడు, 'అయితే నిన్ను నేను భార్యగా చూసుకోవడంలేదా? ని న్నెక్కడ తక్కువగా చూశా నని? ఈ పొలంగొడవలు చూసుకోవాల్సింది నేను, నువ్వు కాదుగదా!'

'నా కామాత్రం తెలియక పోలేదు.'

'రాధా ! నువ్వు ఆవేశపడుతున్నావు. ఆవేశం ఎంత ద్రోహం చేయగలదో జీవితం నాకు బాగా నేర్పింది. నా జీవితాన్ని, ఆశల్ని నీ చుట్టూ అల్లుకున్నాను. నాకు నువ్వుతప్ప వేరే ఎవ్వరూలేరు. ఆవేశపడి జీవితంలో నాకు మిగిలిన అమృతాన్ని కాస్తా వొలకపోయకు.'

రాధ కళ్ళలో నీళ్లు గిర్రున తిరిగాయి. ఏడుస్తూ జగన్నాథం వొళ్ళో పడిపోయింది. జగన్నాథాన్ని హత్తుకుని పొర్లిపొర్లి ఏడ్చింది. జగన్నాథం రాధని పసిపాపలా బుజ్జగించాడు. 'రాధా ! నామీద ఎందుకంత కోప మొచ్చింది?' లాలనగా అడిగాడు.

'నాకు మీ మీద కోపంలేదు...ఏవిటో చికాగ్గా ఉంది. రోజూ విసుగు పుడ్తోంది!'

'కొన్ని రోజులపాటు పట్నం వెళ్దామా? బాబాయి మరీమరీ రమ్మని రాస్తున్నాడు!'

రాధకళ్ళు ఆనందంగా మెరిశాయి.

రాధకి పట్నం వాతావరణం కళ్ళు జిగేలు మనిపించింది. క్రొత్త ప్రపంచంలో అడుగు పెట్టినట్లనిపించింది. ఆ ఎలక్ట్రిక్ దీపాలు,

బారులుతీర్చిన రోడ్లు; కార్లు, ఆ జనసందోహాన్ని చూసి రాధ విచిత్రానందాన్ని అనుభవించింది. జగన్నాథం బాబాయి సీతారామయ్య. కలవాడు. కంట్రాక్టుల్లో బాగా ఆర్జించాడు. వాళ్ళది పెద్దబంగళా. ఆ భవనంలో ప్రతిదీ వింతగానూ, విస్మయపరచేదిగానూ కన్పిస్తోంది రాధకు. ఇంటినిండా బల్లలు, కుర్చీలు, సోఫాలు. సీతారామయ్యకు, భార్య శ్రీదేవమ్మకు, కూతుళ్ళు వనజ, నీరజలకు వేరువేరు గదులు, శ్రీదేవమ్మ తమ్ముడు ఆనందరావుకి వేరేగది. ఆఫీసు గది, అతిథుల గదులు, భోజనాలహాలు, పడకగదులు, షవర్ బాత్‌రూంలు, వీటన్నిటినీ రాధ ఆశ్చర్యంతో చూసింది.

సీతారామయ్య, శ్రీదేవమ్మ రాధని, జగన్నాథాన్ని ప్రేమగా ఆదరించారు. వాళ్ళకి ప్రత్యేకంగా గదులు ఏర్పాటు చేశారు.

వనజ, నీరజ రాధతో కూర్చుని పల్లెటూరి కబుర్లు చెప్పించుకున్నారు. ఇద్దరూ కలిసి పొడుగుపాటి రాధ జడని తాకిచూసి ఆశ్చర్యపోయారు. రాధకి రెండు జడలు వేశారు. పువ్వులు రెండుజడలమధ్య వారధిలా కట్టారు. చెక్కిళ్ళకు రోజ్‌పౌడర్ అద్దారు. కళ్ళకొసల రేఖగా కాటుక దిద్దారు. రాధ కట్టుకున్న కలనేతచీర విప్పించేసి వాళ్ళ నైలాన్‌చీర కట్టబెట్టారు. రాధ ఈ అలంకారంతో అద్దంలో చూసుకుని అబ్బురపడింది. తనింత అందంగా ఉంటానని ఇంతకుముందు తెలియదు. రాధకు ఒకరకమైన మైమరుపు కలిగింది. ఇంతసొగసు ఆ పల్లెటూళ్ళో, మట్టిలో ఎందుకూ లెక్కకి రాకుండాపోయింది.

సాయంత్రం జగన్నాథం, సీతారామయ్య బయటికి వెళ్ళారు. వాళ్ళు వచ్చేప్పటికి రాత్రి పొద్దుపోయింది. అప్పటికి ఇంట్లో అంతా భోజనాలు చేశారు. ఆ ఇంట్లో ఎవరిభోజనం వాళ్ళదే. ఒకరికోసం ఒకరు కనిపెట్టుకునిఉండే అలవాటు లేదు. రాధ తనకంటె ముందే భోజనం చేసిందని తెలిసి జగన్నాథం కొంచెం కలతపడ్డాడు. తనకన్న ముందు భోంచేయకూడదనికాదు. ఇంతకుముందెన్నడూ అలా జరగలేదు.

జగన్నాథం పడుకుని ఆలోచిస్తున్నాడు. రాధ ఆకులు వక్కలు తీసుకొచ్చింది. జగన్నాథానికి ఆకులు వేసుకునే అలవాటు లేదు. సంవత్సరానికొకసారి వేసుకుంటే విశేషమే. ఈరోజు అసలు వేసుకోవాలని లేదు. రాధవైపు చూశాడు. ఆ అలంకారం అతనికి దిగ్భ్రమ గొల్పింది. కళ్ళార్పకుండా చూశాడు. తనకంటె ముందే తాంబూలం నమిలిన రాధ పండుపెదవులు నవ్వుతున్నాయి. ఇంతకాలం హాయిగా నడిచిన జీవనపద్ధతి తలకిందైపోతున్నట్లనిపించింది. రాధ తన మార్గంనుంచి వేరై వేరేదోవన-ముఖ్యం తనకు పడనిమార్గాన నడుస్తున్నట్లనిపించింది.

'ఆకులు వద్దు' అన్నాడు జగన్నాథం.

'ఈ ఒక్కరోజు సరదాగా వేసుకోండి.'

'వద్దు...వద్దు...'

'పోన్లెండి ... నా తాంబూలం పండిందా' ... తుళ్ళిపడుతూ... నవ్వుతూ అడిగింది రాధ.

'ఈ చీర బావుందికదూ! రేపు వనజ వాళ్ళ క్లబ్బుకి తీసుకెళ్తానంది వెళ్ళనా?... పట్నం ఇంత బావుందే... నా కింతవరకూ చూపించనేలేదూ...' ఖుంగమూతి పెట్టింది రాధ. కిలకిల నవ్వింది.

రాధ ప్రతిమాట, ప్రతికదలిక తుపాను రాబోయేముందు నల్లమబ్బులో మెరిసిన మెరుపుల్లా ఉన్నాయి.

'నా వొంట్లో బాగులేదు. నను పడుకోనీ' అటు తిరిగి పడుకున్నాడు జగన్నాథం.

'నాకు నిద్ర రావటం లేదు బాబూ ... కాస్సేపు చదువుకుంటాను' అంటూ పత్రిక తీసింది రాధ. అది సినిమా పత్రిక.

ఇదివరకయితే జగన్నాథానికి బాగు లేదంటే ఎంచేతని గుచ్చి గుచ్చి అడిగి అమృతాంజనం రాసి పాదా లొత్తి అతన్ని నిద్రపుచ్చి నిద్ర పోయేది.

మర్నాడు మధ్యాహ్నం జగన్నాథం నిద్ర లేచేసరికి రాధ ఇంట్లో లేదు. వనజ నీరజలతో మాట్నీ సినిమాకి వెళ్ళింది. జగన్నాథం కాఫీ తాగి బయటికి నడిచి వెళ్లాడు. రాత్రి ఎనిమిదింటికి తిరిగొచ్చేసరికి భోజనం చేసి తాంబూలం నములుతున్న రాధ కన్పించింది. రోజా రంగు జార్జెట్ చీర, పాము తోకల్లా కళ్ళచివర కాటుకగీతలు, కావాలని నుదుటిమీదికి లాగిన వెంట్రులు ... రాధవైపు చూడలేకపోయాడు.

రాత్రి రాధ గదిలో కొస్తుంటే చూశాడు. ఆ నడక మారిపోయింది. అనవసరమైన వొంపులు. 'ఏవిటిదంతా?' అన్నాడు జగనాథం.

'ఏం బావులేదా?' తన్ని తను చూసుకుంటూ అంది రాధ.

'నువ్వు చాలా మారిపోతున్నావ్!' బాధతో జగన్నాథం గొంతు జీరపోయింది.

రాధ జగన్నాథం వైపు చూసింది. ఆ కనుబొమలు ముడిపడడం ఆ ముఖం అదోరకంగా మారిపోవటం రాధ ఇదివరకెన్నడూ చూడలేదు. అతని అయిష్టాన్ని గుర్తించింది.

'వాళ్ళంతా సరదగా చేస్తున్నారు. నేను కాదంటే ఏం బావుంటుంది?' అంది రాధ.

'అది వొట్టి సరదా ఐతే ఫరవాలేదు. కాని ఒక్క విషయం జ్ఞాపకం ఉంచుకో. మన జీవనపద్ధతులు వేరు. మనది పల్లె. మనం తృప్తిగా ఇంత తిని ఇతరులకు చేతనైనంత సాయం చేస్తూ, ఇంతవరకూ ఏ వొడుదుడుకులు లేకుండా కాలం గడిపాం. ఈ కృత్రిమాలంకారులు, మెరమెచ్చులు మనపద్ధతికి సరిపడవు. మనస్సు ప్రధానంగా బతికేవాళ్ళం మనం. పట్నంలో అలాకాదు. దేహానికీ, హంగులకీ ఆడంబరాలకీ బోలెడు ప్రాధాన్యత ఇస్తే తప్ప ఇక్కడ జనం బతకలేరు. ఇలాంటి ఆడంబరాలు వ్యసనాల్లాంటివి. ఒక పట్టాన వొదిలించుకోటం కష్టం. అలా సాగిపోతే మనసు

వాటికి దాస్యం చేసే దుర్గతి కలుగుతుంది. మెరుపులు చూడటం గొప్ప అనుభూతే. కాని, మెరుపులు పిడుగులు కురిపిస్తా యనే మాటకూడ జ్ఞాపకం ఉంచుకోవాలి.

రాధకి ఆ మాటలు చాలాభాగం బోధ పడలేదు. కాస్తంత అలంకారం చేసుకున్న మాత్రాన వచ్చే ఉపద్రవ మేమిటో అంత కన్నా అంతు పట్టలేదు. ఆ మాట లన్నీ కటువుగా తోచాయి. జగన్నాథం వైపు చూసింది. ఆ కళ్ళు మెరుస్తున్నాయి. తను అతన్ని కాదనలేదు. అతనితో వాదించలేదు.

'మీకు ఇష్టంలేని పని ఏదీ చెయ్యను... మిమ్మల్ని కష్టపెట్టాను.

జగన్నాథం రాధని వొళ్ళోకి తీసుకుని బుజ్జగించాడు.

రాధ మాటనిలబెట్టుకోలేదు మర్నాడు నీరజతో క్లబ్బుకువెళ్ళింది. వాళ్లు రెండో ఆట సినిమాలకుకూడా వెళ్ళి వస్తున్నారు. రోజూ మొత్తంమీద జగన్నాథంతో రాధ ఒక గంటకూడా కాలక్షేపం చేయలేక పోతోంది. కార్లలోషికార్లు, నీరజ వనజలతో కబుర్లు, ఛలోక్తులు, వాళ్ళ స్నేహితులతో పరిచయాలు, వాళ్ళ ఇళ్ళలో పార్టీలు_పీటిలో మునిగిపోయింది రాధ.

జగన్నాథం తలకిందై పోయాడు. రాధ తన్నించి వేరై పోతోంది. దూరంగా బహు దూరంగా వేరేమార్గంలో పరుగెత్తుతోంది. అతను అడ్డుపెట్టలేదు. ఆ వెల్లువను ఆప టానికి ప్రయత్నించటం వల్ల ప్రయోజనం ఉండ దనుకున్నాడు. తీసుకొచ్చిన డబ్బు చాలాభాగం ఖర్చయిపోయింది. వెంటనే బయలుదేరి వెళ్లాలి.

'మనం రేపు శనివారం ఇంటికి వెళ్దాం.'



రాధ మాట్లాడలేదు. జగన్నాథం ప్రతి మాటా కదలికా తన సుఖానికీ ఆనందానికీ అడ్డంకులుగా కన్పిస్తున్నాయి. ఆ పల్లెటూరూ, గుడ్డిదీపాలూ, మురికితనం, మడ్డీ రాధ కళ్ళముందు కొచ్చాయి.

'పదిరోజుల్లో అట్లతద్దె వస్తోంది. పండగయ్యాక వెళ్ళమంటున్నారు అత్తయ్య' అంది రాధ.

పట్నంలో అట్లతద్దె అంటే జగన్నాథానికి నవ్వొచ్చింది. 'ఇక్కడ ఎక్కువ కాలం ఉండటం ఆరోగ్యం కాదు. ఇంటికి ఉత్తరం రాసేశాను. వెంటనే వెళ్ళిపోవాలి.'

రాధ లోలోపల కుంగిపోతోంది. ఇంతవరకూ తన ఇష్టాన్ని ఎవరూ కాదనలేదు. ఆ స్వాతంత్ర్యానికి అలవాటు పడింది. ఇప్పుడు భర్త అయినా సరే తన్ని అణిచి పెట్ట చూస్తూంటే సహించలేక పోతోంది. అప్పటికీ నవ్వు తెచ్చుకుని అంది 'మీకిక్కడ బాగులేదా ?'

'నా పద్ధతులు నీకు తెలుసు' అంతకంటె ఎక్కువ చెప్పదలుచుకోలేదు జగన్నాధం.

'పోనీ పండగ వెళ్ళేదాకా ఉండి వెల్దామండీ' జాలిగా అడిగింది రాధ.

జగన్నాథం ఏమీ చెప్పలేకపోయాడు. అలాగే రాధవైపు చూస్తున్నాడు. నుదుటిమీది బొమముడి ఇంకా విడలేదు.

రాధ భరించలేక పోయింది. 'సరే... మీ కిష్టం లేకపోతే వెళ్ళిపోదాం. మీ ఇష్టప్రకారమే కానివ్వండి.'

జగన్నాథం నొచ్చుకున్నాడు. 'మరి... మరి...పండగ వెళ్ళేదాకా ఉందామన్నావ్?'

'అన్నాను' రాధ గొంతు బొంగురుపోయింది. 'మీరు వెల్దామంటున్నారుకదా... మీ కిష్టం లేని పని ఎన్నడూ చేయను.' రాధ ముఖంమీద కన్నీళ్లు.

'సరే...అలాగే. ఏడవకు. అడక్కుండా వచ్చేది అదొక్కటే. అలాగే...పండగ వెళ్ళాకే వెల్దాం. ఇవ్వాళ్ళే ఉత్తరం రాసేస్తాను,' అంటూ లేచి నుంచుని పచార్లు చేయటం మొదలెట్టాడు జగన్నాథం.

'ఎందుకు అంత కోపం ? మీ రెప్పుడూ ఇలా లేరు. మీ ఇష్టంకోసం నా క్కావలసింది వొదులుకుంటున్నాను. ఇంకా కోపమెందుకూ ?'

తిరుగుతున్న జగన్నాథం ఆగిపోయి రాధవైపు సూటిగా చూశాడు. 'వొదులుకుంటున్నావా !...నీ క్కావలసింది వొదులుకుంటున్నావా...నీ కోసం నేను వొదులుకోలేకపోతున్నాను...ఎవరు ఎంత ఎక్కువ వొదిలేసుకుంటే అంత గొప్ప. అవును. ఇదే భార్యాభర్తలమధ్య ఉండాల్సింది.'

ఇంత వ్యంగ్యం, ఇన్ని నిప్పుల్లాంటి మాటలు జగన్నాథం నోటంట వినటం ఇదే మొదటిసారి. రాధ అహం దెబ్బతిన్నది. అవమానం పొందినట్లు బాధపడింది. అతనేనా మాట్లాడుతోంది అనుకుంది. తనింకా కొన్ని రోజులు ఉందా మనుకున్నా అతని ఇష్టంకోసం తను లొంగిపోయి వెల్దామంటే తన్ని ఇలా పొడవటమా ! ఇంకో నాలుగు రోజు లుంటే తప్పేముంది? దానికింత రభసెందుకు ?

'మీరు చాలా మారిపోయారు—నా మీద మీ కెందుకో కోపంగా వుంది. నా తప్పేమిటో స్పష్టంగా చెప్పండి. నన్ను అన్యాయం చేస్తున్నారు' అంటూ రాధ గోడవైపు నడిచి వెళ్ళింది.

జగన్నాథం లేచివచ్చి బుజాలు పట్టి తనవైపు తిప్పుకుంటాడనీ, తన కన్నీటికళ్ళు ముద్దు పెట్టుకుంటాడనీ, దాంతో జరిగిందంతా కొట్టుకుపోతుందనీ అనుకుంది రాధ,

జగన్నాథం కూర్చున్నచోటునుంచి లేవలేదు. 'అయితే నీ కింకా అర్థం కాలేదన్నమాట' అన్నాడు.

'......'

'అయితే చెప్తున్నా విను మారిపోయింది నేను కాదు; నువ్వు. నీవు ఇక్కడ అడుగు పెట్టిన క్షణంనుంచీ మారిపోయావు. కృత్రిమమైన అలంకారాలు, ఆడంబరాలు నీకు జీవితంలో ముఖ్యమైపోయాయి. నీ భర్త, నీ ఇల్లు, నీ సంసారం వీటిముందు తేలికైపోయాయి. పైగా నాకోసం వొదిలేసుకుంటున్నా నన్నావ్-త్యాగం చేస్తున్నా నన్నావ్-నాకు ఆ మాట తల్చుకుంటేనే అసహ్యం వేస్తోంది.' కోపంతో ఊగిపోయాడు జగన్నాథం.

రాధకి వొల్లంతా దహించుకుపోతున్నట్లనిపించింది. రాధ కళ్ళు నిప్పులు కురిశాయి. 'అంతే...అంతే...ఏ తప్పూ లేకపోయినా తిట్టి పోయడం మీకే చెల్లింది. సరే...మీ కోసం నే నేమీ వొదిలేసుకోవాల్సిన పని లేదు. నేను పండగ వెళ్ళాక గాని రాను. రేపు శనివారం; అసలు బయలుదేరను' రాధ కోపంతో వొణికిపోయింది. ముఖమంతా ఎర్రబారిపోయింది.

'సరే; నీ కిక్కడే బావుంది. నీ ఇష్టమొచ్చినప్పుడు రా...నీకూ నాకూ తెగిపోయింది. నేను ఒక్క క్షణం కూడా ఉండను' అంటూ జగన్నాథం గబగబా బయటికి నడిచి వెళ్ళిపోయాడు.

రాధకు జగన్నాథాన్ని తల్చుకుంటే అసహ్యం వేసింది. ఇందాక కోపంతో ఏమేమందో జ్ఞాపకం లేదు...కాని...తల్చుకుంటే భయం వేసింది. ఇంతటితో ఇద్దరికీ తెగిపోతుందా ! .... ఈ కోపం తగ్గాక తన తప్పేమీ లేదని గ్రహించకపోతారా ? ఆయనే తన జీవిత మనుకుని ఆరాధించానే... నన్నింత నీచంగా మాట్లాడ్డం న్యాయమేనా.. ఒంటరిగా గదిలో కూర్చుని కుళ్ళి కుళ్ళి ఏడ్చింది.

ఆ మధ్యాహ్నం జగన్నాథం ప్రయాణమయ్యాడు. తనకి అర్జంటు పనుందనీ, పండగయ్యాక రాధని పంపమనీ చెప్పాడు. రాధ ఇచ్చిన సంచీ తీసుకుంటూ 'వెళ్తున్నాను' అన్నాడు. రాధకు అప్పు డర్థమయింది, తనకూ ఆయనకూ మధ్య ఎంత పెద్ద అగాధం ఉందో.

ఆ రోజల్లా రాధ దిగులుగా కూర్చుంది. సీతారామయ్య ఇంటి వాతావరణం దిగులుగా భారంగా కూర్చోనివ్వలేదు. నీరజ క్లబ్బులో డాన్స్‌కి తీసుకెళ్ళింది. మళ్ళీ సినిమాలు,

షికార్లు. ఈసారి వీళ్ళతోటి ఆనందరావు కూడా కలిసాడు. రోజూ ఏదో ఒక కాలక్షేపం. పొద్దు తెలియటం లేదు. ఏ పనీ లేకపోతే నలుగురూ రాత్రి పొద్దుపోయేదాకా పేకాట ఆడేవారు. ఒక్కొక్క రోజు రాత్రి పడుకున్నప్పుడు రాధకు జగన్నాథం జ్ఞాపకం వచ్చేవాడు. ఆ ప్రసన్నమైన ముఖం, ఆ చల్లటి కళ్ళు జ్ఞాపకంవచ్చి దుఃఖం పొంగుకొచ్చేది. అంతలో ఆ రోజు తన్ని నీచంగా ఛీదరించుకోటం జ్ఞాపకం వచ్చేది. ఇంతలో తిరిగి తిరిగి అలిసిపోయిన దేహానికి నిద్ర ముంచుకొచ్చేది.

అట్లతద్ది వెళ్ళి వారమైంది. రాధకి ఇంటికి వెళ్ళాలనిపించలేదు. మర్యాదకు పండుగ వెళ్ళగానే వెళ్తానంది. శ్రీదేవమ్మ 'వెళ్దగానిలే, తొందరేముందీ. జగన్నాథాన్ని ఉత్తరం రాయనీ' అంది. వనజ నీరజ కూడా ఇంకొంతకాలం ఉండిపొమ్మని బలవంతం చేశారు. జగన్నాథం వెళ్ళినప్పటినుంచీ ఇంతవరకూ ఉత్తరం లేదు.

ఒకరోజు సాయంత్రం రాధ ఇంట్లో ఒంటరిగా ఉండిపోయింది. తలకాయ నాదుగా ఉంది, నేను క్లబ్బుకి రానంటే వనజ నీరజ వెళ్ళిపోయారు. శ్రీదేవమ్మ సీతారామయ్య షికారు కెళ్ళారు. ఆనందరావు బజార్నించి రాలేదు. రాధ తోటలో తిరుగుతోంది. ఇంతలో ఆనందరావు వచ్చిన అలికిడైంది. వంటమనిషిని పిలిచి ఆనందరావుకి కాఫీ ఇవ్వమని చెప్పి తోటలోకి వచ్చి కూర్చుంది. వెచ్చని ఎండలో గాలికి వూగుతున్న పువ్వుల్ని చూస్తోంది.

'ఒక్కరూ ఇక్కడ కూర్చున్నారేం?' ఆనందరావు.

రాధ కొంచెం తత్తరపడింది 'ఏ... ఏం లేదు. ఊరికే...'

'నే నిక్కడ కూర్చుంటే మీ కేమన్నా అభ్యంతరమా ?'

'ఉహూ' ఆనందరావు పక్కగా ఉన్న రాతిబల్లమీద కూర్చున్నాడు.

ఇద్దరూ మాట్లాడటం లేదు. ఎవరి ఆలోచనలు వాళ్ళవి. ఆనందరావు అందంగా ఉంటాడు. ఎర్రగా గుండ్రటి ముఖం, ఉంగరాలజుట్టు నుదుటి మీదికి పడ్తోంది. అతను నవ్వితే కళ్ళు నవ్వుతాయి; చెక్కిళ్ళు



నవ్వుతాయి; ముఖమంతా బుక్కాయి చిమ్మినట్లయిపోతుంది. పొడుగాటి చేతుల్తో ఏం చేయాలో తెలియక పక్కనున్న గడ్డిని తెంపుతున్నాడు. ఆ విశాలమైన ఛాతీమీద చిన్న పుట్టుమచ్చ. ఆనందరావు రాధవైపు చూసేసరికి రాధ అతనివైపు చూస్తోంది. ఆనందరావు రాధవైపే చూస్తున్నాడు. అలాగే చూస్తున్నాడు. రాధ అతన్ని చూడనిచ్చింది. ఆ చూపులు వెచ్చగా ఉన్నాయి. ఆనందరావు ముఖం నవ్వుతోంది. రాధ నవ్వింది. ఆనందరావు దగ్గర కొచ్చి కూర్చున్నాడు. రాధ చెయ్యి పట్టుకున్నాడు. ఆ స్పర్శ వేడిగా ఉంది. ఆమెలోని నరాలు, నెత్తురు ఉవ్వెత్తున పొంగాయి. ఈ వేడి తనింతవరకు ఎరగదు. ఈ వేడిలో ఇంత సుఖ ముంటుందనికూడా తెలియదు. అతను ఇంకా దగ్గరగా జరిగాడు. రెండు కాలుతున్న పెదవులు ఆమె బుగ్గను తాకాయి. ఇంకా దగ్గరకు జరుగుతున్నాడు. జ్వాల రాధని కౌగలించుకుంటోంది. రాధకు నేల కూలిపోతున్నట్లు, తను పాతాళంలోకి కుంగిపోతున్నట్లు అనిపించింది. వదిలించుకొని లేచింది. గదిలోకి పరుగెత్తి తలుపు గడియ పెట్టుకుంది.

ఐదు నిముషాలదాకా రాధకు జరిగిందేమిటో సరిగ్గా తెలిసిందికాదు. తన పువ్వులాంటి సాంసారిక జీవనం భగ్నమైంది. తను జగన్నాధానికి అన్యాయం చేసింది...ఆయిన ఉత్తముడు...దేవుడి లాంటి వాడు... ఆ పాదాలమీద పడి కనీళ్లతో కడిగితేగాని తన పాపం ప్రక్షాళితం కాదు. ఆ రాత్రంతా రాధ కుళ్ళికుళ్ళి ఏడ్చింది.

రాధ మర్నాడు పొద్దున్నే ప్రయాణమైంది. శ్రీదేవమ్మ బలవంతం చేసినా ఉండలేదు. నౌకర్ని తోడు చేసుకుని పల్లెకు వచ్చేసింది. రాధనుచూసి జగన్నాథంఆశ్చర్యపోయాడు. 'ఉత్తరం రాయకుండా వచ్చేశావేం...రేపు నేనే బయలుదేరి వద్దా మనుకుంటున్నాను !'

జగన్నాథాన్ని చూడగానే రాధకు కన్నీళ్లు పొర్లుకొచ్చాయి. ఏమీ మాట్లాడలేకపోయింది.

'ఏమిటి...ఏం జరిగింది రాధా.'

రాధ కళ్ళలో అశ్రుధారలు.

'ఏం జరిగింది...'

'నేను మీతో రానంటే మీ రొక్కరూ వచ్చేయటమేనా ? నన్ను కేకలేసి మీతో ఈడ్చుకు రాలేకపోయారా ?'

'అయిపోయిందిగా...ఇప్పుడు వచ్చేశావుగా...లే...లే.'

జగన్నాథంలో ఏ మా ర్పూ లే దు. ముఖంలో అదే ప్రసన్నత. అదే చల్లటి చూపు ఏమీ జరగనట్లేనవ్వుతూ మాట్లాడుతున్నాడు. జగన్నాథం తన్ని క్షమించిన తీరును చూసి రాధ ఆయన్ను-మనసులో పువ్వుల్తో పూజించుకుంది. అతని ఉదాత్తత రాధకి ఇంత స్పష్టంగా ఎప్పుడూ దర్శనమివ్వలేదు.

రాత్రి జగనాథం రాధని తన కౌగిట్లోకి తీసుకున్నప్పుడు రాధ తిరిగి కన్నీళ్ళలో మునిగిపోయింది. రాధ కన్నీరు చూసి జనన్నాథం కలత పడ్తున్నాడు. రాధ సమాధానం చెప్పదు. ఆతని కౌగిట్లో మరింత వొదిగిపోయింది. నన్ను విడిచి పోవద్దన్నట్టు అతన్ని మరింతగా చుట్టేసింది. ఇంతకుము న్నెన్నడూ వాళ్లు అంత ఆనందమయమైన రాత్రి ఎరుగరు.

రోజులు గడుస్తున్నాయి. రాధకు వెనకటి పీడకల మళ్ళీ ప్రత్యక్షమైంది. జగన్నాథం యధావిధిగా తన పనులు చూసుకుంటున్నాడు. రాధకు మిగిలింది వంట... తిండి...నిద్ర. జగన్నాధానికి అన్నీ అమర్చిపెట్టటం ఆమె జీవితమై పోయింది. జగన్నాధం అదే నవ్వు...అదే చూపు...అంతా సవ్యంగా జరిగిపోతున్నట్టు రాధలో రేగుతున్న అశాంతిని గుర్తించాల్సిన అవసరం ఎవరికీలేదు. తనలోని బడబానలం పొంగి తనే భస్మమై పోవాలి; అంతే...అంతే... ఈ ఆలోచనలతో రాధ ఆరోగ్యం క్షీణించడం మొదలెట్టింది.

జగన్నాథం రాధని డాక్టరుకు చూపిస్తానన్నాడు. రాధ అక్కర్లేదంది. జగన్నాథం తల్లికూడా అక్కర్లేదంది. రాధ తండ్రికి ఉత్తరం రాయించింది. పదిరోజుల్లో రాధ తండ్రి వచ్చి రాధని పుట్టింటికి తీసికెళ్ళాడు.

రాధ మంచంలో పసిపాప కేరు మంటున్నాడు. ఆ మధుర స్వనానికి రాధ స్తన్యం పొంగుతోంది. ఆ చిన్నికళ్ళు, చిట్టినోరు, వూగిస్తున్న బుల్లి చేతులు రాధకు ఓ దివ్య మూర్తి వెలసినట్లనిపిస్తోంది. పాపని మాటి మాటికీ గుండెకు హత్తుకుంటోంది. ఆ స్పర్శ వెడిగా లేదు. చల్లగా లేదు. అదో దివ్యానుభవం. పన్నెండో రోజు బారసాలకి జగన్నాథం వచ్చాడు. అతని కళ్లు ఆనందంతో రెపరెప లాడాయి. ఆ ముఖం, ఆ చిరునవ్వువెన్నెల చూసి రాధ తల వంచుకుంది.

పాపని చూసి జగన్నాథం కళ్ళు చెమర్చినై. రాధవైపు చూశాడు. అతడి కళ్ళు చెమర్చినై. రాధని దగ్గరకు తీసుకున్నాడు. ఆ స్పర్శ చందనపు పూతలా, పూర్ణిమ వెన్నెలలా చల్లగా హాయిగా ఉంది. వెచ్చగా నరాల్ని నెత్తుర్ని ఉత్తేజపరచలేదు.

'అవును. నే నేం పసిపిల్లనుకాను, ఆలా ఉండా లనుకోడానికి' అనుకుంది రాధ.

